క్లుప్తంగా

ఇరిగేషన్ స్థల ఆక్రమణపై చర్యలు



పామర్రు: ఇరిగేషన్ స్థలాలను ఆక్రమించుకున్న వారిపై తగువిధమైన చర్యలు తీసుకోనున్నట్లు ఇరిగేషన్ ఏఈఈ అరుణ్ పేర్కొన్నారు. స్థానిక బస్టాండ్ ఎదురుగా పుల్లేరు కాలువ గట్టున ఉన్న ఇరిగేషన్ స్థలంలో ఏర్పాటు చేసిన షాపును శనివారం తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇరిగేషన్ స్థలాలపై అక్రమ కట్టడాలను నిర్వహిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. భవిష్యత్‌లో పుల్లేరు కాలువ వెంబడి రహదారి ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. దీని కోసం కాలువ గట్టున ఉన్న అన్ని ఆక్రమణలను త్వరలో తొలగించనున్నట్లు పేర్కొన్నారు. న్యాయ స్థానం తీర్పునకు విరుద్ధంగా ఎవరైనా అక్రమ కట్టడాలకు పాల్పడితే సంబంధిత వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

ధ్యానంతో జ్ఞానం



గుడివాడ టౌన్: ధ్యానంతో మానసిక ఒత్తిడి తగ్గించుకుని జ్ఞానాభివృద్ధి పొందవచ్చునని పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా కృష్ణాజిల్లా ఇన్‌చార్జి రాజకుమారి అన్నారు. శనివారం పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా కార్యాలయంలో ధ్యానం సారాంశం బ్రోచర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శాఖాహారం భుజిస్తూ ధ్యానం చేయడం మేధస్సుకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. అట్టివారిని పిరమిడ్ ధ్యానకేంద్రం ప్రోత్సహిస్తూ సమాజానికి సాధుతత్వాన్ని పరిచయం చేస్తోందన్నారు. కార్యక్రమంలో ఎం.వాణి, పి.గుణ ప్రసన్నాంభ, పి.సీతామహాలక్ష్మి, ఎస్.అనుశ్రీదేవి పాల్గొన్నారు.

పైపులైన్ లీకులకు మరమ్మతులు చేయాలి

గుడివాడరూరల్: తాగునీటి పైపులైన్ లీకులకు మున్సిపల్ అధికారులు మరమ్మతులు చేసి, అరికట్టాలని మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ గుడివాడ వైస్ చైర్మన్ పిన్నమనేని వేణుగోపాలరావు కోరారు. శనివారం గుడివాడ బైపాస్‌రోడ్ నుంచి వలివర్తిపాడు రోడ్ టర్నింగ్ వరకు ఉదయం తాగునీరు వదిలిన సమయంలో పైప్ లైన్లు లీకై రహదారి మీదకు నీరు చేరి నిల్వ ఉంటుందని, ఈ సమస్యను వెంటనే మున్సిపల్ అధికారులు పరిష్కరించాలని ఆయన కోరారు. అదే విధంగా గౌతమ్ స్కూల్ దాటిన తర్వాత రహదారి మీద గోతులు పడి వాహనదారులు ప్రమాదాలబారిన పడుతున్నారని, సంబంధిత అధికారులు తాత్కాలిక మరమ్మతులు చేయాలని ఆయన కోరారు.

పోషకాలు కలిగిన ఆహారం తీసుకోవాలి

పమిడిముక్కల: చిరుధాన్యాలు, ఆకుకూరలు, తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు కలిగిన ఆహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఝాన్సీరాణి పేర్కొన్నారు. పోషణ అభియాన్ కార్యక్రమంలో భాగంగా చోరగుడి అంగనవాడీ కేంద్రంలో శనివారం పోషణ పక్వాడ కార్యక్రమం జరిగింది. పోషకాహార ప్రాముఖ్యతపై తల్లులకు అవగాహన కల్పించారు. వెల్‌బేబీ షో నిర్వహించి బహుమతులు అందజేశారు.

ముగిసిన మండల దీక్ష



జురువరం(పామర్రు): మండలంలోని జురువరం గ్రామంలోని శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయ ప్రాంగణంలో వేంచేసియున్న శ్రీ భక్త ఆంజనేయ స్వామి ఆలయం వద్ద మాఘ మాసంలో ప్రారంభమైన హనుమాన్ చాలీసా పారాయణ 42 రోజుల దీక్ష శనివారంతో ముగిసింది. గ్రామానికి చెందిన శ్రీ యోగానంద లక్ష్మీ నరసింహ స్వామి భక్త సమాజం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ మండల దీక్ష స్వస్తి మంత్ర పుష్పంతో ముగింపు పలికారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు రొంపిచర్ల ధన వెంకట సత్యనారాయణాచార్యులు, భజన సమాజం ప్రతినిధులు కొండలు, జన్ను రాణి, కొలుసు జేజి కుమారి, లక్ష్మి పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళి అమలు చేయాలి

పమిడిముక్కల: ఎన్నికల ప్రవర్తనా నియమావళిని కచ్చితంగా అమలు చేయాలని తహసీల్దార్ సత్యనారాయణ, ఈఓఆర్డీ కొండేటి వెంకటేశ్వరరావు, ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం సచివాలయ సిబ్బంది, వీఆర్వోలకు ఎన్నికల నియమావళిపై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేటు స్థలాల్లో ఉన్న కటౌట్లు, బ్యానర్లు, ఫ్లెక్సీలను వెంటనే తొలగించాలన్నారు. బడ్డీకొట్లుపై రాజకీయ పార్టీల గుర్తులు, బొమ్మలుంటే తొలగించాలన్నారు. పార్టీ కార్యాలయాల ఏర్పాటుకు ఆర్వో నుంచి అనుమతి తెచ్చుకోవాలన్నారు.

ఎంతమంది కలసి వచ్చినా జగన్‌ను ఏమీ చేయలేరు

కైకలూరు: ఎన్ని జెండాలు జతకట్టినా, ఎంతమంది కలసి వచ్చినా సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సింగిల్‌గానే ప్రజల ఆశీస్సులతో ఎదుర్కొంటారని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) చెప్పారు. గుడ్ మార్నింగ్ కైకలూరు కార్యక్రమం శనివారానికి 21వ రోజుకు చేరింది. వెలంపేట 20వ వార్డులో ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించారు. ఎమ్మెల్యే డీఎన్నార్‌కు మహిళలు హారతులు పట్టారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వెలంపేటలో ఇప్పటికే రోడ్లు, డ్రెయిన్లు ఏర్పాటు చేశామన్నారు. పూర్తిగా మార్పు చేయాలంటే రూ.కోట్లు ఖర్చు అవుతోందని అంచనా వేశామన్నారు. ఎన్నికల్లో సీఎం జగన్ మరోసారి ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేయగానే ప్రత్యేక నిధులతో వెలంపేటను అభివృద్ధి చేస్తామన్నారు. చంద్రబాబు మాటలను ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరన్నారు. రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థిగా తనకు, ఎంపీ అభ్యర్థిగా కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. భగత్‌సింగ్ వర్ధంతి సందర్భంగా చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ అడవి కృష్ణ, వైస్ ఎంపీపీ మహమ్మద్ జహీర్, ఎంపీటీసీ సభ్యులు మూడేడ్ల శశికళ, నాయకులు హమీద్, రఫీ, గంగుల అశోక్, పాట్రిక్ పాల్, బూరుబోయిన మోహనరావు, గాలిబ్ బాబు, కన్నా రమేష్, దండే రవి ప్రకాష్, బిరుదుగడ్డ లాజర్, తులసి పూర్ణ, గౌరీనాయుడు, వేగిరెడ్డి మంగరాజు, పంజా నాగు, సమయం అంజి, ఏసుకుమార్ పాల్గొన్నారు.

జగనన్నను ఆశీర్వదించండి

ముదినేపల్లి రూరల్: జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసేందుకు ప్రజలంతా మరోసారి ఆశీర్వదించాలని స్థానిక ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) కోడలు దూలం స్వాతి, ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యురాలు ఈడే వెంకటేశ్వరమ్మ కోరారు. మండలంలోని పెదగొన్నూరు శివారు విశ్వనాద్రిపాలెంలో వైఎస్సార్ సీపీ తరఫున నాలుగో రోజు శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధి ప్రాతిపదికగా జగనన్న చేస్తున్న పాలనతో అన్నివర్గాలు లబ్ధి పొందాయన్నారు. నవరత్నాల పేరుతో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పేదల కుటుంబాల్లో ఆర్థిక వెలుగులు నింపడంతో పాటు వారి స్థితిగతులను పూర్తిగా మార్చివేశాయన్నారు. జగనన్న తిరిగి ముఖ్యమంత్రిగా కొనసాగితేనే సంక్షేమ పథకాలు మరింత సమర్థవంతంగా అమలు జరుగుతాయని పేర్కొన్నారు. ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులుగా పోటీ చేస్తున్న దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్), కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్‌కు ఘన విజయాన్ని చేకూర్చి జగనన్న ముఖ్యమంత్రి కావడానికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు రాచూరి రాధా, చొప్పర్ల సునీత, ఎంపీటీసీ సభ్యుడు ఏసుబాబు, సర్పంచ్ తాడంకి శిరీష, నాయకులు మోట్రు ఏసుబాబు, కోమటి విష్ణువర్ధన్, బొర్రా శేషుబాబు, అల్లాభక్షు, పేర్ని పృథ్వీ, రాజేష్ పాల్గొన్నారు.



ఆశీర్వాదించాలని కోరుతున్న ఎమ్మెల్యే డీఎన్నార్



విశ్వనాద్రిపాలెంలో ప్రచారం చేస్తున్న దూలం స్వాతి, నాయకులు



రాచపట్నంలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్ సతీమణి వీరాకుమారి

అందుబాటులో ఉంటున్న నాయకుడు డీఎన్నార్

కైకలూరు: నియోజకవర్గ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండే వ్యక్తి ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) అని ఎమ్మెల్యే సతీమణి వీరాకుమారి పేర్కొన్నారు. ఆమె రాచపట్నం గ్రామంలో శనివారం ప్రచారం చేశారు. సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా దూలం నాగేశ్వరరావును, ఎంపీ అభ్యర్థిగా కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్‌ను అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరారు. నియోజకవర్గంలో ఎన్నడూ లేని అభివృద్ధి జరిగిందని, మంచి చేస్తేనే మరోసారి విజయం అందించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ అడవి కృష్ణ, సర్పంచ్‌లు బోడావుల మంగారావు, ఉప్పలపాటి నాగమణి, ఎంపీటీసీ సభ్యులు ఈదా కృష్ణవేణి, పందు గాంధీ, నాయకులు జయదేవ్, లక్ష్మణ్, సమయం అంజి, పంజా నాగు, గాలిబ్‌బాబు, తమ్మిరెడ్డి నారాయణ, కన్నా రమేష్, బందా నారాయణ పాల్గొన్నారు.

శోభాయమానంగా స్వామి, అమ్మవార్ల వివాహ వేడుకలు

కూచిపూడి(మొవ్వ): మొవ్వ మండలం కూచిపూడిలోని శ్రీ బాలా త్రిపురసుందరి సమేత శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో కల్యాణ మహోత్సవాలు శోభాయమానంగా సాగుతున్నాయి. ఆదివారం తెల్లవారు జామున కల్యాణ మహోత్సవం జరగనున్న నేపథ్యంలో శనివారం గ్రామంలోని మహిళలు పసుపు కొట్టే కార్యక్రమాన్ని మంగళవాయిద్యాల మధ్య నిర్వహించారు. అలాగే శ్రీ రామలింగేశ్వరునికి కూచిపూడి గ్రామానికి చెందిన వ్యాపారి చిట్టూరి ప్రభాకరరావు రూ.65 వేల విలువ గల వెండి ధార పాత్రను ఆలయ పాలక మండలి కమిటీ అధ్యక్షుడు కావూరి భానుమూర్తి, అర్చకులు పెనుమూడి పూర్ణ చంద్ర శర్మ, కార్యదర్శి బి.బాలకృష్ణ ప్రసాద్, ఉపాధ్యక్షుడు పసుమర్తి నారాయణమూర్తికి అందజేశారు.



అమ్మవారి సన్నిధిలో పసుపు కొడుతున్న మహిళా భక్తులు

మరోమారు జగనన్నకు పట్టం కడదాం



గుర్వాయపాలెంలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న దూలం శ్రీఅనుపమ

కలిదిండి: 99 శాతం హామీలను నెరవేర్చి సరికొత్త చరిత్ర సృష్టించిన జగనన్నకు మరోమారు పట్టం కడదాం అని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) పెద్ద కోడలు శ్రీఅనుపమ అన్నారు. సార్వత్రిక ఎన్నికల ప్రచారం భాగంగా గుర్వాయిపాలెంలో నాయకులతో కలిసి ఇంటింటా ప్రచారాన్ని శనివారం నిర్వహించారు. సర్పంచ్ బత్తిన ఉమామహేశ్వరరావు, ఏఎంసీ చైర్మన్ కొల్లాటి సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు తిరుమాని రమేష్, ఎంపీటీసీ సభ్యులు గోదావరి సత్యనారాయణ, పాలపర్తి జార్జ్, రాజు పాల్గొన్నారు.

రాజకీయంగా ఎదుర్కొనలేకనే ఆరోపణలు



మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

నందివాడ: రాజకీయంగా తనను ఎదుర్కొలేక అసత్య ఆరోపణలు చేయడం సమంజసం కాదని వైఎస్సార్ సీపీ నాయకుడు గూడపాటి వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. మండలంలోని తుమ్మలపల్లిలోని ఆయన స్వగృహంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. తాను ఎకరం భూమిని ఆక్రమించానని ఎల్లో మీడియాను అడ్డం పెట్టుకుని టీడీపీ నాయకులు చేస్తున్న ప్రచారం పూర్తిగా అవాస్తమన్నారు. ఆ భూమికి సంబంధించిన రైతు సుందరరావు, యార్లగడ్డ వెంకట్రామయ్య అనే వ్యక్తికి విక్రయించారని, దానికి సంబంధించిన అన్ని ఆధారాలు ఉన్నాయన్నారు. గ్రామానికి ఎవరైనా సాయం కోసం వస్తే వారికి మంచి చేయడమే తప్ప మోసం చేయడం తనకు చేతకాదన్నారు. తాను ఎటువంటి చర్చకైనా సిద్ధమన్నారు. తనమీద ఆరోపణలు చేసిన వారు చర్చకు రావాలన్నారు. దమ్ము, ధైర్యం ఉంటే తనపై ఆరోపణలు రుజువు చేయాలని లేనిపక్షంలో పరువునష్టం కేసు వేస్తానని హెచ్చరించారు.

వీకేఆర్ ఫెస్ట్‌కు విశేష స్పందన

గుడివాడ టౌన్: స్థానిక వీకేఆర్, వీఎన్‌బీ అండ్ ఏజీకే ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన వీకేఆర్ ఫెస్ట్–2024 కు విశేష స్పందన లభించిందని ప్రిన్సిపాల్ ఎస్‌హెచ్‌వీ ప్రసాదరావు పేర్కొన్నారు. గత రెండు రోజులుగా జరిగిన ఈ ఫెస్ట్‌కు జిల్లా నలుమూలల నుంచి వివిధ కళాశాలలకు చెందిన 130 మంది విద్యార్థులు, వీకేఆర్ కళాశాల విద్యార్థులు 160 మంది పాల్గొన్నారన్నారు. షార్ట్‌ఫిలిం కంటెస్ట్, ఫొటోగ్రఫీ, ఫొటోషాపి ఎడిట్, మాక్‌ప్రెస్, ఇన్‌స్టా రీల్స్, జనరల్ అండ్ టెక్నికల్ క్విజ్ తదితర అంశాలు ఇక్కడ చోటుచేసుకున్నాయని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులకు ఆటలు, పాటల పోటీలు నిర్వహించామన్నారు. విజేతలకు బహుమతులు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ వేములపల్లి కోదండరామయ్య, డైరెక్టర్ కల్యాణ్‌కుమార్ పాల్గొన్నారు.




విజేతలకు బహుమతులు అందజేస్తున్న ప్రిన్సిపాల్


రూ.50 వేలకు మించితే సంబంధిత పత్రాలు చూపించాలి

కైకలూరు: ఎన్నికల కోడ్ అమలులో భాగంగా రూ.50 వేల కంటే ఎక్కువ నగదును ఎవరైనా రవాణా చేస్తే సంబంధిత ధ్రువపత్రాలను పోలీసులకు చూపించాలని కైకలూరు పట్టణ సీఐ ఆకుల రఘు పేర్కొన్నారు. కైకలూరు, గోపవరం, రాచపట్నం గ్రామాల్లో ఎన్నికల నేపథ్యంలో కైకలూరు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కె.భాస్కరరావుతో కలసి సాయుధ దళాల కవాతు శనివారం నిర్వహించారు. ఎస్సై ఎంఆర్‌కే రాజు పాల్గొన్నారు.

భగత్‌సింగ్‌కు ఘన నివాళులు



భగత్‌సింగ్‌కు నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు



పామర్రులో భగత్ సింగ్ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

గుడివాడ టౌన్: స్వాతంత్ర్య సమర యోధుడు భగత్‌సింగ్ వర్ధంతి స్థానిక సీపీఎం కార్యాలయంలో శనివారం జరిగింది. భగత్‌సింగ్ చిత్రపటానికి సీపీఎం నాయకులు పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో కృష్ణాజిల్లా రైతు సంఘం కార్యదర్శి గొరిశెట్టి నాగేశ్వరరావు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్‌సీపీ రెడ్డి, సీపీఎం నాయకులు నీలం మురళీకృష్ణారెడ్డి, చల్లగుళ్ల సుబ్రహ్మణ్యం, పి వీరమ్మ, ప్రభుదాసు, అవిర్నేని వెంకటేశ్వరరావు, బి.అరుణ పాల్గొన్నారు.

ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో..

ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో స్థానిక ఎస్‌పీఎస్ హైస్కూల్‌లో భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ వర్ధంతి జరిపారు. ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి సమీర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పామర్రులో..

పామర్రు: భగత్ సింగ్ వర్ధంతి కార్యక్రమం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో శనివారం నిర్వహించారు. తొలుత ప్రజానాట్యమండలి కళాకారులు అమరవీరుల త్యాగాలను గుర్తు చేసుకునే పలు పాటలను పాడారు. నాయకులు జుజ్జువరం రామస్వామి తదితరులు భగత్ సింగ్, సుఖదేవ్, రాజ్‌గురు పటాలకు నివాళులర్పించారు. కౌలు రైతు సంఘం జిల్లా నాయకులు శీలం నారాయణ, విల్సన్, కె.నాగభూషణం, లక్ష్మణ, మురళి, ఆదిశేషు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు



కలిదిండి: దక్షిణ కాశీగా పేరు గడించిన కలిదిండి పార్వతీ సమేత పాతాళ భోగేశ్వర స్వామి ఆలయంలో శివరాత్రి సందర్భంగా ప్రారంభమైన ఉత్సవాల్లో భాగంగా 16వ రోజు పురస్కరించుకుని అఖండ అన్నసమారాధన శనివారం నిర్వహించారు. ముందుగా స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఈఓ శింగనపల్లి శ్రీనివాసరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పోలీసుల కవాతు

కూచిపూడి(మొవ్వ): సార్వత్రిక ఎన్నికలను పురస్కరించుకుని పామర్రు సర్కిల్, కూచిపూడి పోలీసుల ఆధ్వర్యంలో ఫ్లాగ్ మార్చ్ ర్యాలీని మొవ్వ మండలంలోని పలు గ్రామాల్లో శనివారం నిర్వహించారు. పామర్రు సీఐ వి.సుభాకర్, కూచిపూడి ఎస్‌ఐ శ్రీనివాస్ పర్యవేక్షణలో శాంతి భద్రతల నిర్వహణలో భాగంగా సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీస్ దళాలతో కలిసి కవాతు నిర్వహించారు. తొలుత భట్లపెనుమర్రు గ్రామ ప్రధాన కూడలిలోని జాతీయ పతాక రూపశిల్పి పింగళి వెంకయ్య విగ్రహానికి గౌరవ వందనం చేశారు.



పింగళి వెంకయ్య విగ్రహానికి నివాళులర్పిస్తున్న సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీస్ దళాలు

వేంకటేశ్వర స్వామికి గొడుగులు బహూకరణ

గుడివాడ టౌన్: స్థానిక జగన్నాథపురం పాటి మీద వేంచేసియున్న శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానం ఉపయోగార్థం ప్రముఖ రియల్ ఎస్టేట్ వ్యాపారి మాటూరి రంగనాథ్ రెండు గొడుగులు సమర్పించుకున్నట్లు ఆలయ ఈఓ నటరాజన్ షణ్ముగం శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ స్వామి వారి నగర సంకీర్తన, ఉత్సవ విగ్రహ ఊరేగింపు, ఆలయంలో స్వామికి నిర్వహించే అనేక సేవా కార్యక్రమాల్లో ఈ గొడుగులు వినియోగించడం ఆనవాయితీ అన్నారు. భక్తులు ఈ విధంగా స్వామి వారి సేవకు మరింతగా ఉపయోగపడాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఆలయ పాలక మండలి అధ్యక్షుడు డొక్కు రాంబాబు, సభ్యులు దొండపాటి కృష్ణారావు, వంగపండు బ్రహ్మాజీ, అంకం ధనలక్ష్మి, తాడిపత్రి సునీత, అర్చకులు వేదాంతం అప్పలాచార్యులు పాల్గొన్నారు.



స్వామికి సమర్పించుకున్న గొడుగులతో ఆలయ పాలక మండలి సభ్యులు

వైభవంగా అమృతేశ్వరుడి కల్యాణం

ముదినేపల్లి రూరల్: మండలంలోని సింగరాయపాలెం శ్రీఅమృతేశ్వరస్వామి వార్షిక కల్యాణోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి స్వామివారి కల్యాణం వైభవంగా జరిగింది. స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను వేదికపై అందంగా అలంకరించి ఆలయ ప్రధాన అర్చకుడు రుద్రపాక ప్రసాద్ ఆధ్వర్యంలో వేదమంత్రోచ్చరణలు మంగళవాయిద్యాల నడుమ కల్యాణతంతు నిర్వహించారు. ఈ కల్యాణాన్ని తిలకించేందుకు అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. ఈఓ శింగనపల్లి శ్రీనివాసరావు, చైర్మన్ కంతేటి వరలక్ష్మీ పాలకవర్గ సభ్యులు పర్యవేక్షణ చేశారు. అదేవిధంగా స్థానిక లక్ష్మీనృశింహస్వామి ఆలయ వార్షిక కల్యాణోత్సవాల్లో భాగంగా సింహవాహనంపై గ్రామోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. సింగరాయపాలెం ప్రధాన వీధుల్లో ఈ ఉత్సవం నిర్వహించగా భక్తులు హారతులతో స్వామివారికి స్వాగతం పలికారు. ఆలయ చైర్మన్ మీగడ నెలబాలుడు, పాలకవర్గసభ్యులు పర్యవేక్షణ చేశారు.



అమృతేశ్వరుని కల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

అలరించిన ప్రభుత్వ పాఠశాల వీడ్కోలు కార్యక్రమం

కైకలూరు: ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేటు స్కూల్స్ కంటే మెరుగైన మౌలిక వసతులు అందుబాటులోకి వచ్చాయని వేమవరప్పాడు సర్పంచ్ నున్న రాంబాబు చెప్పారు. గ్రామంలో 2023–2024 ఏడాది ప్రభుత్వ పాఠశాల 8వ తరగతి విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమం శనివారం జరిగింది. చదువు, సాంస్కృతిక కార్యక్రమాల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు దాతల సాయంతో బహుమతులు అందించారు. కార్యక్రమంలో హెచ్ఎం చంద్రశేఖర్, స్కూల్ అభివృద్ధి కమిటీ చైర్మన్ బోడావుల బాలఏసు పాల్గొన్నారు.



వేమవరప్పాడులో 8వ తరగతి విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమం

ఘనంగా గరుడోత్సవం



వరహాపట్నం పుర వీధుల్లో ఊరేగుతున్న లక్ష్మీనృసింహస్వామి

కైకలూరు: వరహాపట్నం శ్రీభూ సమేత శ్రీలక్ష్మీనృసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు భక్తిశ్రద్ధలతో జరుగుతున్నాయి. శనివారం ఉదయం స్వామికి సహస్రనామార్చన, నిత్యహోమం, గ్రామ బలిహరణ అనంతరం గరుడోత్సవం నిర్వహించారు. స్వామిని వాహనంపై పురవీధుల్లో ఊరేగించారు. సాయంత్రం కల్పవృక్ష వాహన సేవ జరిగింది. ఆలయ ఈఓ వీఎన్‌కే శేఖర్ మాట్లాడుతూ ఆదివారం చందనోత్సవం, నృసింహయాగం, రథోత్సవం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

పైప్‌లైన్ మరమ్మతుల పరిశీలన

మండవల్లి: మండవల్లి సెంటర్‌లో వాటర్ ట్యాంక్‌కు నుంచి కుళాయిలకు సరఫరా చేసే వాటర్ పైప్‌లైన్ మరమ్మతు పనులను సర్పంచ్ మెండా ఝాన్సీ శనివారం పరిశీలించారు. వైఎస్సార్ సీపీ నాయకుడు మెండా సురేష్ పాల్గొన్నారు.

ఘనంగా ఉరుసు మహోత్సవం

కోడూరు: మత సామరస్యానికి ప్రతీకగా నిలిచే పెదగుడుమోటులో బెంగాలీషా బాబావలి ఉరుసు మహోత్సవానికి భక్తజనం పోటెత్తారు. శుక్రవారం రాత్రి 8 నుంచి శనివారం ఉదయం 5గంటల వరకు ఉరుసు మహోత్సవాన్ని అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. నిజాంపట్నం, విజయవాడ, మచిలీపట్నం, గుంటూరు, ప్రకాశం, నరసరావుపేట ప్రాంతాలకు చెందిన ముస్లింలు ప్రత్యేక వాహనాల్లో ఉరుసుకు తరలిరావడంతో దర్గా ప్రాంగణం భక్తజనంతో కిక్కిరిసింది. బాబావారి సమాధిపై పచ్చరంగు వస్త్రాన్ని కప్పి గంధాన్ని చల్లారు. ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి తమ భక్తి భావం చాటుకున్నారు. పలువురు గ్రామస్తులు డప్పువాయిద్యాలు మధ్య ప్రత్యేకంగా అలంకరించిన జెండాలను ఊరేగించుకుంటూ దర్గా వద్దకు తీసుకువచ్చారు. దర్గా వద్ద ఆటగుర్రం విన్యాసాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఎస్‌ఐ శిరీష సిబ్బందితో కలిసి బందోబస్తు నిర్వహించారు. కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

సంక్షిప్త వార్తలు

గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యం

పామర్రు: గుర్తుతెలియని మహిళ మృతదేహాన్ని శనివారం పోలీసులు గుర్తించారు. పోలీసులల కథనం మేరకు మండలంలోని నెమ్మలూరు పంచాయతీ పరిధిలో నిర్మాణంలో ఉన్న బెల్‌కంపెనీ వెనుక ప్రాంతంలో గుర్తు తెలియని సుమారు 50 ఏళ్ల పైబడి వయస్సు ఉన్న మహిళ మృతదేహం ఉన్నట్లు స్థానిక పశువుల కాపరుల సమాచారం మేరకు పోలీసులు సంఘటనా స్థలం చేరుకుని విచారించారు. ఆ మహిళ నాలుగు రోజులుగా అక్కడే ఉంటోందని, ఎవరు ఏమి ఇచ్చినా తినేది కాదని తెలిసింది. ఆహారం లేక పోవడం, ఎండ వేడిమి తట్టుకోలేకే శనివారం మృతి చెందిందని శవ పంచనామాతో ప్రాథమికంగా తెలిసిందని ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. ఆమె మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గుడివాడ ప్రభుత్వ వైద్య శాలకు తరలించామని తెలిపారు.

కేయూలో హోలీ వేడుకలు



కోనేరుసెంటర్: కృష్ణా విశ్వవిద్యాలయంలోని రసాయన శాస్త్ర విభాగం ఆధ్వర్యాన శనివారం హోలీ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆది, సోమవారాలు సెలవు కావటంతో విద్యార్థులు ఒక్కరోజు ముందుగానే హోలీ పండుగ సంబరాలు జరుపుకున్నారు. విద్యార్థినీవిద్యార్థులు ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ సందడి చేశారు. ఈ సందర్భంగా రసాయనశాస్త్ర విభాగాధిపతి మాట్లాడుతూ క్రీడలను, పండుగలను, మన సంస్కృతి సంప్రదాయాలను, విద్యార్థులకు దగ్గర చేసి, వారిని వాటిలో పాల్గొనే విధంగా తోడ్పాటును అందించడంలో రసాయన శాస్త్ర విభాగం ముందు ఉంటుందన్నారు. కార్యక్రమంలో రసాయనశాస్త్ర విభాగాధిపతి డి.రామశేఖరరెడ్డి, బోధన, బోధనేతర సిబ్బంది జి.రవి, డాక్టర్ కె.పుష్పలత, డాక్టర్ రాంబాబు, డాక్టర్ టి. అనిల్ కుమార్, డాక్టర్ నరేష్ బాబు పాల్గొన్నారు.